ప్రజాశక్తి

చీరల పంపిణీ

ప్రజాశక్తి-పెదబయలురూరల్: మండలంలోని బంగారమెట్ట గ్రామంలో విశాఖపట్నం పోర్ట్ ఉద్యోగి, ఆత్మ తృప్తి చారిటబుల్ ట్రస్ట్ కోశాధికారి తలారి జానకరావు సహకారంతో ఎంపిటిసి సభ్యులు చెండా కొండమ్మ చేతుల మీదుగా 100 మంది మహిళలకు చీరలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తలారి జానకరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ సిహెచ్ రమేష్, సచివాలయం మహిళా పోలీస్ ఎస్.భూలక్ష్మి, వైసిపి నాయకులు జగన్నాథం, కృష్ణమోహన్, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

చీరలు పంపిణీ చేస్తున్న ఎంపిటిసి

భోగి మంటల్లో ..

జిఒ1 కాపీలు దగ్ధం

అరకులో దగ్ధం చేస్తున్న సిఐటియు నేతలు

▶▶ హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలి ▶▶ మన్యంలో గిరిజన సంఘం, సిపిఎం ఆధ్వర్యాన నిరసనలు

పాడేరులో జిఒ కాపీలను దగ్ధం చేస్తున్న గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి-పాడేరు: మన్యంలో భోగి మంటలు ఉవ్వెత్తున ఎగిసాయి. భోగి పండగను పురస్కరించుకొని శనివారం వేకువ జామున మంచు కురుస్తున్న వేళ మన్యంలో వాడవాడలా ప్రజలు భోగిమంటలు వేసుకుని చలి కాచుకుంటూ రంగవల్లులు వేస్తూ సంతోషంగా సంక్రాంతి సంబరాలకు ఆహ్వానం పలికారు. పలుచోట్ల భోగి మంటల్లో గిరిజన సంఘం నాయకులు, గిరిజన ప్రజలు, జీవో నెంబర్ 1 ప్రతులను, హైడ్రో పవర్ ప్రాజెక్టు ఒప్పంద పత్రాలను వేసి దగ్ధం చేశారు. చింతపల్లి మండలం చౌడిపల్లిలో జీవో 1 కాపీలను గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి చిరంజీవి ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 1ను తక్షణమే రద్దు చేయాలని గిరిజన సంఘం నాయకులు నినాదాలు చేశారు. చింతపల్లి మండలం చౌడుపల్లి పంచాయతీ వాముగడ్డ గ్రామంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఒప్పంద పత్రాలను భోగి మంటల్లో వేసి దగ్ధం చేసి గిరిజనులు తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి మాట్లాడుతూ, గతంలో ప్రతిపక్షంలో ఉన్న సిఎం జగన్ పాదయాత్ర చేసినప్పుడు అప్పటి ప్రభుత్వం ఇటువంటి జీవోలు తెచ్చి ఉంటే పాదయాత్ర చేయ గలిగేవారా అని ప్రశ్నించారు. అందలమెక్కిన వైయస్ జగన్ ఇప్పుడు ఓటమి భయంతో ఇటువంటి జీవోను తెరపైకి తీసుకు వచ్చారని విమర్శించారు. ఇది జగన్ నియంత పాలనకు నిదర్శనమని, ప్రజల గొంతునొక్కే ఈ చీకటి జీవోణష్ట్ర రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలుచోట్ల గిరిజన సంఘం ఆధ్వర్యంలో భోగి మంటల్లో జీవో 1 కాపీలు, హైడ్రో పవర్ ప్రాజెక్టు ఒప్పంద పత్రాలు దహనం చేసి తమ నిరసన గళం వినిపించారు. ఈ కార్యక్రమంలో సాగిన రాము, సత్యనారాయణ, సాగిన వీరన్నపడాల్, నాగరాజు, టి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వం ఏకాపక్ష నిర్ణయంతో విడుదల చేసిన జీవో 1, హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణాలకు సంబంధించిన కాపీలను భోగి మంటలలో దగ్ధం చేశారు. సిపిఎం జెడ్పిటిసి దీసరి. గంగరాజు, అనంతగిరి సర్పంచ్ సోమ్మెల రూతులు బొడ్డాచెట్టు కాలనీ గ్రామంలో భోగి మంటలలో జీవో 1 కాపీలను స్థానిక ప్రజలతో కలిసి దగ్ధం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయంతో జీవోలు విడుదల చేసి భయ భ్రాంతులకు గురి చేస్తుందన్నారు. చీకటి జిఒలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మండలంలోని టోకురు పంచాయతీ చిట్టంవలస, పెద్దకోట పంచాయతీ రేగులపాలెం, గుమ్మకోట పంచాయతీ గుజ్జలి ప్రాంతాలలో నిర్మించే హైడ్రో పవర్ ప్రాజెక్టులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రజల బతుకులు నాశనం చేసే హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణాలను తక్షణమే రద్దు చేయాలన్నారు. గ్రామాలలో సర్వేలకు వచ్చిన అదాని, .అంబిని సంస్థలకు చెందిన బృందాలకు తరిమి కొట్టడం జరిగిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెళ్లక్కు తగ్గక పోతే పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.నాగులు, బి.శేఖర్ కె.శివ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: మండలంలోని శరభగూడ గ్రామంలో బోగి మంటల్లో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతి పత్రాలను సిఐటియు నాయకులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.బాలదేవ్ మాట్లాడుతూ, ఐదో షెడ్యూల్ ఏరియాలో ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీలు ప్రాజెక్టల నిర్మాణం చేపట్ట రాదని సుప్రీంకోర్టు తీర్పులున్నప్పటికీ వాటిని ధిక్కరించి రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్‌లో ఆమోదించడం తగదన్నారు. ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.గిరిజన సలహా మండలి (టి.ఏసి)లో తీర్మానం లేకుండా కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తూ క్యాబినెట్ ఆమోద నిర్ణయం చట్ట వ్యతిరేకమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏకపక్షంగా గత రెండు సంవత్సరాల నుండి హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం దొంగచాటుగా టూరిస్ట్‌ల పేరుతో సర్వే వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు షోలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించకూడదని జారీ చేసిన జీవో 1 తక్షణమే రద్దు చేయాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు మగ్గన్న, సహదేవ్, గిరిజన సంఘం నాయకులు జగన్నాథం, గోపాల్, అర్జున్, మొంగు నాయుడు, తదితరులు పాల్గొన్నారు

విఆర్.పురం : జీవో 1 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రం రేఖపల్లిలోని భోగి మంటల్లో జీవో కాపీలను సిపిఎం నాయకులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్న బాబు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ, అసంఘటిత రంగాలతో పాటు వామపక్షాల ఉద్యమాలను అణచివేసే కుట్రలో భాగంగానే జీవో 1ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పంకు సత్తిబాబు, నల్లారపు ప్రకాశరావు, లింగమూర్తి, కారం సత్తిబాబు, సరిహద్దు రాజేశ్వరరావు, మానికల సూరిబాబు, మొగిలి పువ్వు, సతీష్, వరహాలరావు పాల్గొన్నారు.

ఎటపాక: రోడ్లపై ర్యాలీలు, రోడ్ షోలు వంటివి నిషేధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జిఒ నెంబర్ 1 ప్రతులను సిపిఎం ఆధ్వర్యాన శనివారం మండలంలోని గుండాల కాలనీలో భోగిమంటల్లో వేసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఐవి మాట్లాడుతూ నాడు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్న భారతీయులను నిర్బంధించటం కోసం 1861లో ఆంగ్లేయులు తెచ్చిన ప్రజా వ్యతిరేక చట్టాన్ని ఈనాడు ముఖ్యమంత్రి తీసుకురావటం దారుణమన్నారు. అందుకే ఈ జీవోను రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ పద్మ, ఎన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎటపాకలో దగ్ధం చేస్తున్న నాయకులు

టిడిపి ఆధ్వర్యాన

రంపచోడవరం : రంపచోడవరం మండల కేంద్రంలో జీవో నెంబర్ వన్ ప్రతులను టిడిపి ఆధ్వర్యాన భోగిమంటల్లో తగలబెట్టారు. చీకటి జీవోలు రద్దు చేయాలి, సైకో పోవాలి సైకిల్ రావాలి అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి మాట్లాడుతూ జగన్ రెడ్డి ప్రభుత్వం చీకటి జీవోలు విడుదల చేసి, ప్రజా వ్యతిరేకత విధానాలపై నిరసన తెలిపే ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కారం సురేష్ బాబు, పెంటపాటి అనంత మోహన్, దిండి జనార్ధన్, కుంజం బాపన్న దొర, ప్రసాద్, పాకరాజు, కుంజం వాణి, రామన్న దొర, నేరం వీరస్వామి అబ్బులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండల కేంద్రంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు జిఒ 1 ప్రతులను టిడిపి నాయకులు భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపిపి కొర్ర పద్మ మాట్లాడుతూ, పెరిగిన ధరలతో ప్రజలు సంక్రాంతి పండుగను కూడా సంతోషంగా జరుపుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కిముడు కళ్యాణం, యూత్ నాయకులు కె.కొండబాబు, సీనియర్ నాయకుడు వంతల గణపతి, మండల కార్యవర్గ సభ్యులు రీమలి కొండబాబు, మహిళలు పాల్గొన్నారు.

జి.మాడుగులలలో జిఒ కాపీలను దగ్ధం చేస్తున్న నాయకులు

ఆందోళన చేస్తున్న పాఠశాల శానిటేషన్ సిబ్బంది

వేతన బకాయిలు చెల్లించాలని ఆందోళన

ప్రజాశక్తి-విఆర్.పురం

పాఠశాలల శానిటేషన్ వర్కర్లకు 4 నెలలుగా చెల్లించాల్సిన వేతన బకాయిలు ఇవ్వాలని కోరుతూ శనివారం భోగి పండుగను పురస్కరించుకొని రేఖపల్లిలోని స్థానిక యంఆర్‌సి కార్యాలయం వద్ద శానిటేజర్ వర్కర్లు ఆందోళన చేపట్టారు. తమకు వెంటనే పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, వేతనాలు పెంచాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల శానిటేజర్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు కారం రంగమ్మ, కార్యాదర్శి సోడి వరలక్ష్మి మాట్లడుతూ రాష్ట్రమంతా అందరూ ఉద్యోగులూ భోగి పండుగ సంక్రంతి సంతోషంగా జరుపుకుంటే మాకు అటువంటి సరదాలు కూడా లేక ఇలా కార్యాలయం ముందు ఆందోళన చేయాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు రాక పండుగ పూట పస్తులు ఉండే దుస్థితి దాపురించిందన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం వెంటనే వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కారం నాగమ్మ, నాగుల కమల, సున్నం వెంకమ్మ, కోర్స లాలమ్మ, శీలం వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

సిఐగా బాజీలాల్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

రాజవొమ్మంగి నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్‌కె.బాజీలాల్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన సిఐ రవికుమార్ కృష్ణా జిల్లాకు బదిలీ కాగా, అమలాపురం రూరల్ నుండి బదిలీపై బాజీలాల్ రాజవొమ్మంగి సిఐగా వచ్చారు. ఈ సందర్భంగా సిఐని రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్సైలు టీజీ నరేంద్ర ప్రసాద్, షరీఫ్, పోలీస్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సిఐ బాజీలాల్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ నేపథ్యంలో మండలంలో ఎక్కడైనా కోడిపందాలు, గుండాట, పేకాట, చిత్తులాట వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కోడిపందాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌కె.బాజీలాల్

జానకిరామ్‌కు రగ్గు, నిత్యావసరాలు అందజేసిన పవన్ ప్రియరాజు దంపతులు

అంధుని కుటుంబానికి సాయం

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు పంచాయతీ పరిధి చంద్రుపల్లి గ్రామానికి చెందిన అంధత్వం కలిగిన గిరిజన చిన్నారి జానకిరామ్ కుటుంబానికి ఏపీ జెన్కో సీలేరు జల విద్యుత్ కేంద్రం ఏఈ పవన్ ప్రియరాజు దంపతులు రగ్గు, నిత్యావసర సరుకులు శనివారం పంపిణీ చేశారు. చంద్రుపల్లి గ్రామానికి చెందిన కిలో పదం దంపతులకు నలుగురు మగ పిల్లలు కాగా, వారిలో అంధత్వం కలిగిన కుమారుడు కూడా ఉన్నారు. జానకిరామ్‌కు పుట్టుకతోనే అంధత్వం ఉండగా, నాలుగేళ్ల వయస్సులో ప్రమాదవశాస్తు చేతులు, శరీర అవయవాళ్ళలో మరికొన్ని చోట్ల కాలిపోయాయి. వారి ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న పవన్ ప్రియరాజు దంపతులు స్థానిక నాయకులు కారే శ్రీనివాస్ సహాయంతో కాలినడకన చంద్రుపల్లి గ్రామానికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు. రగ్గు, నిత్యావసర సరుకులు అందజేశారు. వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవడమే కాకుండా, అంధత్వం కలిగిన శివకు వైద్య సేవలు అందించాలని పవన్ ప్రియరాజు కోరారు.

గిరిజనులతో ఎస్ఐ రామకృష్ణ

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ, వలస గెడ్డలో 30 మంది గిరిజనులకు స్థానిక ఎస్సై రామకృష్ణ శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. గ్రామస్తులకు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం పలు విషయాలపై చర్చించారు. అసాంఘిక కార్యకలాపాలకు ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి సాగు అక్రమ రవాణా, సారా తయారీ వంటి కార్యకలాపాలు చేయొద్దని హితవుపలికారు.

కోళ్లు, మేకలకు గిరాకీ

ప్రజాశక్తి- హుకుంపేట

సంక్రాంతి పండగ సందర్భంగా మేకలకు, నాటు కోళ్లకు మండలంలోని పలు సంతల్లో గిరాకీ పెరిగింది. కోళ్లకు రూ.1500 నుంచి 3000 వరకు, మేకలు, గొర్రెలకు రూ.10,000 నుంచి 20 వేల వరకు ధర పలికింది. పండగ సందర్భంగా నలుమూలల నుంచి జనాలు భారీ ఎత్తున తన తరలివచ్చారు.

సంతకు తీసుకొచ్చిన మేకలు, గొర్రెలు

మాట్లాడుతున్న అఖిల పక్షం పార్టీల నేతలు

షాపుల నిర్మాణానికి..

గిరిజనులకు స్థలాలు ఇవ్వాలి

- అఖిలపక్ష నేతల డిమాండ్

ప్రజాశక్తి-హుకుంపేట: మండల కేంద్రంలో గిరిజనులు షాపులు కట్టుకోవడానికి స్థలాలు ఇవ్వాలని అఖిలపక్షం నేతలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గిరిజన సంఘం భవనంలో అన్ని పార్టీల నేతలు గిరిజన ప్రజలతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం గిరిజన సంఘం, అఖిలపక్షం నాయకులు మాట్లాడుతూ, మండల కేంద్రంలో గిరిజనులకు షాపులు కట్టుకోవడానికి రోడ్డు పక్కల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీసా, 1/70 గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా ఇల్లు, షాపులను గిరిజనేతరులు కట్టు కుంటున్నారని రెవెన్యూ యంత్రాంగం చూస్తూ ఊరు కుంటుందన్నారు. గిరిజనేతరుల అక్రమ కట్టడాలు వెంటనే కూల్చాలని నాయకులు డిమాండ్ చేశారు. గిరిజనులకు 100శాతం రిజర్వేషన్లను కేటాయించాలన్నారు. గిరిజనులకే షాపుల నిర్మాణానికి స్థలాలు ఇవ్వాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రేగం మత్స్యలింగం, మాజీ జడ్పీటీసీ కొర్ర కాసులమ్మ, వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, తడిగిరి సర్పంచ్, డీఎల్ఓ నాయకులు పెనుమల రంజిత్ కుమార్, గత్తుం పంచాయితీ సర్పంచ్ పాడి పోతురాజు, మెరకచింత మాజీ సర్పంచ్, సీపీఎం మండల కార్యదర్శి వలసనైని లక్ష్మణ్‌రావు, గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శి కిల్లో రామారావు, తాపుల కృష్ణారావు, టీడీపీ నాయకులు, హుకుంపేట వార్డ్ మెంబర్ పాడి వెంకట్, వైసీపీ నాయకులు గండేరు సత్యం, పాంగి కృష్ణారావు, చిట్టిబాబు, కైలాష్, చంద్రబాబు, లక్ష్మణ్, మల్లన్న, నాని, రామారావు, చిట్టిబాబు, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

బెట్టు కాటాలతో మోసం చేయొద్దు

ప్రజాశక్తి-హుకుంపేట: గిరిజనులు పండించిన పంటలకు ఐటిడిఏ ప్రకటించిన ధరకు కొనుగోలు చేయాలని, బెట్టు కాటాలతో గిరిజనులను మోసం చేయవద్దని కాఫీ ఈవో టీ.బాలం నాయుడు తెలిపారు. వారసంతల్లో గిరిజనులు అమ్మకానికి తీసుకు వచ్చిన పంటలను పరిశీలించి వ్యాపారస్తులతో మాట్లాడారు. బెట్టు కాటాలతో మోసాలను విడనాడాలన్నారు. గిరిజనులు పండిస్తున్న అన్ని పంటలను సరసమైన ధరలకు కొనుగోలు చేయాలన్నారు. గిరిజనులు పండిస్తున్న కాఫీ పండ్లను పాడేరు ఐటిడిఏ సహకారంతో గిరిజన సహకార సంస్థ, ఎకో పల్పింగ్ సంస్థల ద్వారా ప్రతి గ్రామంలో కొనుగోలు చేపట్టడం జరుగుతుందన్నారు. రాజ్మా చిక్కుళ్ళు కేజీ రూ.100 నుంచి 150, తిప్పలమోడీ రూ.350 నుంచి 400, పసుపు రూ.100 నుంచి 150, చెర్రీ రూ.150 నుంచి 180 వరకు కొనుగోలు చేయాలని ఆయన తెలిపారు. కాఫీ పండ్లు కేజీ రూ.36 నుంచి, కాపి గుళ్ల రూ. 135 నుంచి 150, పార్చి మెంట్. రూ. 270 నుంచి 290 చొప్పున కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాఫీ లైసెన్ వర్కర్ కే.వాసు దేవుడు, బి.నారాయణ, సత్యానందం, కే.శ్రీను, సత్యనారాయణ, పి.రమేష్ పాల్గొన్నారు.

తూకాన్ని పరిశీలిస్తున్న ఈఓ

ప్రభుత్వం దిగొచ్చే వరకూ పోరాటం

పండగ పూటా కొనసాగిన రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి-పాడేరు

ప్రభుత్వం దిగి వచ్చే వరకు తమ ఆందోళన విరమించేది లేదని తాము చేస్తున్న పోరాటానికి న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ కూడా రాధాకృష్ణ, కో కన్వీనర్ ప్రభుదాస్ స్పష్టం చేశారు. ఐటీడీఏ వద్ద ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం భోగి పండుగ రోజున కూడా కొనసాగాయి. గత రెండు సార్లు జిల్లా గిరిజన సంక్షేమ అధికారులు ప్రజా సంఘాల నాయకులతో వారి డిమాండ్లపై చర్చలు జరిపినప్పటికీ ఫలప్రదం కాక పోవడంతో దీక్షలు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థుల మరణాలు అరికట్టేందుకు అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గు చేటన్నారు. గిరిజన విద్యార్థులు చనిపోతే ధీమాగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గిరిజన విద్యార్థుల వరస మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, ఆశ్రమాల్లో తక్షణమే హెల్త్ అసిస్టెంట్లను నియమించాలని పేర్కొన్నారు. గిరిజన ఆశ్రమ విద్యార్థులు మరణాలు అరికట్టేందుకు శాశ్వత పరిష్కార మార్గం చూపాలని, ప్రజా సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ పిఓ గోపాలకృష్ణ ను తక్షణమే సరెండర్ చేయాలని, పెదబయలు తహసీల్దార్ ఆత్మహత్యపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించాలన్నారు. విద్యార్థి, ప్రజా సంఘాల నేతలను గిరిజన విద్యాసంస్థల్లో ప్రవేశాన్ని నిరాకరిస్తూ గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శి జారీ చేసిన సర్క్యులర్ తక్షణమే రద్దు చేయాలన్నారు.పాడేరు ఐ టిడిఎ పిఓను సరెండర్ చేసేంత వరకు ఉద్యమం ఆపేది లేదని, ప్రభుత్వం స్పందించకపోతే మరింత తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల వేదిక నాయకులు చిన్నారావు, బత్తిరి నరేష్ పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షల్లో కూర్చున్న నాయకులు

మన్యానికి సంక్రాంతి శోభ

థింసా నృత్యం చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి -అనంతగిరి

గిరిజన ప్రాంతంలో ఈనెల 9 నుండి సంక్రాంతి సందడి ప్రారంభమైంది. మన్యంలో ఆయా ప్రాంతాలను బట్టి ఈ పండుగను గిరిజనులు జరుపుకుంటారు. గిరిజన గ్రామాల్లో సంక్రాంతి శోభతో ప్రతి ఇంటి వద్ద రంగురంగుల ముగ్గులు దిద్ది, ఇల్లను సాంప్రదాయపదంగా ముస్తాబు చేశారు. అనేక గ్రామాల్లో ఒకరికొకరు రంగులు పూసుకున్నారు. డప్పు డోలక్కలతో ఆకట్టుకునే విధంగా థింసా నృతాలు యువతీ యువకులు చేస్తూ సంబరాల్లో మునిగి తేలారు. పిండి వంటలను తయారు చేసుకుని పండగను సాంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు.

హుకుంపేట: గ్రామాల్లో సంక్రాంతి సందడి మొదలైంది. పండగ సందర్భంగా ఉద్యోగస్తులు, విద్యార్థులు. తమ సొంత గ్రామాలకు చేరుకొన్నారు. .చుట్టాలను ఇంటికి పిలిచి పిండివంటలు, భోజన విందు ఏర్పాటు చేసి పంపిస్తారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కుటుంబ సమేతంగా ఎంతో ఆనందంగా జరుపుకుంటారు. గ్రామ పెద్దలు అందరూ సహకారంతో మహిళలకు ప్రత్యేకంగా ముగ్గులు పోటీ ఏర్పాటు చేసి గెలుపొందిన మహిళలకు బహుమతులను ప్రధానం చేస్తారు. పండుగను చిన్నపిల్లలు మొదలుకొని ముసలి తాత వరకు ఎంతో ఆనందంగా జరుపుకుంటారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

రాజవొమ్మంగి : సంక్రాంతి పండుగ సందర్భంగా రాజవొమ్మంగి శాంతినగర్ గ్రామంలో శాంతినగర్ యూత్ ఆధ్వర్యంలో శనివారం ముగ్గులు పోటీలు నిర్వహించారు. మండలంలోని దోసరపాము, ఎంత తదితర గ్రామాల్లో ముగ్గుల పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో మహిళలు, బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో అదే గ్రామానికి చెందిన సిహెచ్ ఉమామహేశ్వరి ప్రథమ స్థానంలోనూ, ఎ.శ్రీదేవి ద్వితీయ స్థానంలోనూ, తతీయ స్థానంలో దేవిక, నాగలక్ష్మి నిలిచారు. వీరికి లబ్బర్తి ఎంపీటీసీ గొల్లపూడి పెద్దిరాజు, న్యాయ నిర్ణీతలు ఎం.సావిత్రి, రాణి తదితరులు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీటీసీ పెద్దిరాజు తదితరులు

వామ్మో 'వందే భారత్'

- సామాన్యులు అందుకోలేనంతగా ప్రయాణ ఛార్జీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మేకింగ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా రూపొందించామని చెబుతున్న వందేభారత్ రైలు విశాఖ - సికింద్రాబాద్‌ల మధ్య నడవనున్న క్రమంలో నిర్దేశించిన ప్రయాణ ఛార్జీలు 'వామ్మో' అనిపిస్తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఈ నెల 15న సికింద్రాబాద్‌లో ఈ రైలు ప్రారంభంకానున్న సంగతి తెలిసిందే. ప్రయాణ ధరలు సామాన్యులకు అందుబాటులో లేని విధంగా భారీ స్థాయిలో ఉండటంతోపాటు ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్ ధర సుమారుగా విమానం టికెట్ ధరకు సమానంగా ఉండటంతో ఇది కేవలం సంపన్నుల కోసం మాత్రమే ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ వందే భారత్ రైలులో విశాఖపట్నం - సికింద్రాబాద్‌కు చైర్‌కార్ ధర రూ.1720, ఎగ్జిక్యూటివ్ చైర్ కార్ ధర రూ.3170గా నిర్ణయించారు. ఇది సాధారణ చైర్ కార్ ధరతో పోలిస్తే వంద శాతం అధికం. శనివారం ఉదయం 8 గంటల నుంచి రైలు టిక్కెట్లు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. వాటిని పరిశీలిస్తే విశాఖపట్నం - రాజమండ్రి మధ్య చైర్ కార్ ధర రూ.625, ఎగ్జిక్యూటివ్ చైర్ కార్ ధర రూ.1215, విశాఖపట్నం - విజయవాడ మధ్య చైర్ కార్ ధర రూ.960, ఎగ్జిక్యూటివ్ చైర్ కార్ ధర రూ.1825, విశాఖపట్నం - ఖమ్మం మధ్య చైర్ కార్ ధర రూ.1115, ఎగ్జిక్యూటివ్ చైర్ కార్ ధర రూ.2130, విశాఖపట్నం - వరంగల్ మధ్య చైర్ కార్ ధర రూ.1310, ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్ ధర రూ.2540గా ఉంది.

రైతు బజార్లు కిటకిట

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సంక్రాంతి సందర్భంగా నగరంలోని అన్ని రైతుబజార్లకు ఆ పండగ శోభ శనివారమే వచ్చి చేరింది. ఆదివారం జరిగే సంక్రాంతి వేడుకకు అవసరమైన కూరగాయలు, పండ్లు, పూజా సామగ్రి కొనుగోలు చేయడానికి జనం రైతుబజార్ల బాట పట్టారు. శుక్ర, శనివారాలలో నగరంలోని 13 రైతుబజార్లకు పెద్ద సంఖ్యలో వినియోగదారులు రావడం కనిపించింది. సంక్రాతి రోజున ఆలయాల్లో పితృదేవతల కోసం ఇచ్చే స్వయంపాకం (పొత్తర్ల)లో వినియోగించడానికి కంద, గుమ్మడికాయ, అరటి, చిక్కుడు, తోటకూర వంటివి అధికంగా కొనుగోలు చేశారు. వినియోగదారుల సౌకర్యార్థం కంద, గుమ్మడిని ముక్కలుగా కోసి రూ.10 చొప్పున విక్రయించారు. గిరిజన రైతులు ఎర్రటి చెరుకు గడలు తీసుకువచ్చి విక్రయించారు. చిన్నది రూ.30, పెద్దది రూ.40 ధర పలికింది. పండగ మూడు రోజుల సమయంలో ఇంటికి అవసరమైన కూరగాయలు, కిరాణా సరుకులను సైతం రైతుబజార్లలో కొనుగోలు చేశారు. నగరంలోని ఎంవిపి.కాలనీ, సీతమ్మధార వంటి పెద్ద పెద్ద రైతు బజార్లతో పాటు, పెదవాల్తేరు, నరసింహనగర్, కంచరపాలెం, గోపాలపట్నం, మర్రిపాలెం, గాజువాక ప్రాంతాలలోని రైతు బజార్లు కూడా కిటకిటలాడాయి. అలాగే పాత నగరంలోని పూర్ణా మార్కెట్‌కు కూడా వినియోగదారులు వందలాది మంది తరలివచ్చారు.

పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేరు రైల్వే డివిజన్‌లోని పలాస -విశాఖపట్నం విభాగంలో భద్రతా సంబంధిత పనులు, ఆధునికీకరణ పనులు జరుగుతున్న దృష్ట్యా కొన్ని రైళ్లను రద్దు చేస్తూ, మరికొన్నింటిని రీ షెడ్యూల్ చేస్తూ రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. 18526/18525 విశాఖపట్నం-బ్రహ్మపూర్- విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, 22820/22819 విశాఖపట్నం-భువనేశ్వర్- విశాఖపట్నం ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, 08522/08521 విశాఖపట్నం- గుణుపూర్ - విశాఖపట్నం ప్యాసింజర్, 08532/08531 విశాఖపట్నం-పలాస- విశాఖపట్నం ప్యాసింజర్ రైళ్లు జనవరి 19న రద్దయ్యాయి. 22874 విశాఖపట్నం-దిఘా ఎక్స్‌ప్రెస్ రైలు 3 గంటలా 30 నిమిషాలు ఆలస్యంగా జనవరి 19న సాయంత్రం 19 గంటలకు బయలుదేరే విధంగా రీషెడ్యూల్ చేశారు. 12830 భువనేశ్వర్-చెన్నై సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ 3 గంటలా 30 నిమిషాలు ఆలస్యంగా ఈ నెల 19 మధ్యాహ్నం 15.40 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరే విధంగా మార్పు చేశారు. 18417 పూరీ - గుణుపూర్ ఎక్స్‌ప్రెస్ 30 నిమిషాలు ఆలస్యంగా ఈ నెల 19న మధ్యాహ్నం 12.30 గంటలకు పూరీ నుండి బయలుదేరే విధంగా రీషెడ్యూల్ చేశారు. 18118 గుణుపూర్-రూర్కెలా ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా 19న సాయంత్రం 16.30 గంటలకు గుణుపూర్‌లో బయలుదేరే విధంగా నిర్ణయం తీసుకున్నారు. 11020 భువనేశ్వర్-సిఎస్‌టి ముంబై కోణార్క్ ఎక్స్‌ప్రెస్ గంటా 30 నిమిషాలు ఆలస్యంగా ఈ నెల 19 సాయంత్రం 16.50 గంటలకు భువనేశ్వర్‌లో బయల్దేరుతుంది. 12703 హౌరా- సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ గంటా 45 నిమిషాలు ఆలస్యంగా ఆ రోజు ఉదయం 10.20 గంటలకు హౌరాలో బయల్దేరేలా రీషెడ్యూల్ చేశారు. ప్రయాణికులు ఈ మార్పులను గమనించాలని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి కోరారు.

ఎగిరే పతంగమా.. వర్ణ విహంగమా

- విశాఖ సాగర తీరంలో ఊపందుకున్న గాలిపటాల అమ్మకాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సాగర తీరంలో పతంగులు రెపరెపలాడుతున్నాయి. వివిధ రంగుల్లో.. పలు ఆకృతుల్లో గగనతలంపై ఇప్పటికే విహరిస్తున్నాయి. సంక్రాంతి పండగ నేపథ్యంలో పలువురు ఇసుక తిన్నెలపై నిల్చొని ఆనందోత్సాహాల నడుమ వీటిని ఎగురవేస్తున్నారు. చిన్నా, పెద్దా అన్న తారతమ్యం లేకుండా వీటిని ఎగురవేసేందుకు తీరం కేరాఫ్‌గా మారడంతో పలువురు కాళీమాత గుడి నుంచి వైఎంసిఎ వరకు స్టాల్స్ ఏర్పాటు చేసి పతంగులను, దారాలను విక్రయిస్తున్నారు. యాంగ్రీ బర్డ్స్, గుడ్లగూబ, గ్రద్ధ, చేప తదితర ఆకృతుల్లో లభిస్తున్న గాలిపటాలు చిన్నారులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. సైజు, ఆకృతిని బట్టి ఒక్కో గాలిపటాన్ని రూ.25 నుంచి రూ.వెయ్యి మధ్య ధరల్లో విక్రయిస్తున్నారు. కురుసుర సబ్‌మెరైన్ సమీపంలో చాలా మంది తమ పిల్లలతో కలిసి ఉత్సాహంగా పతంగులను ఎగురవేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

నగరంలో పతంగుల విక్రయ కేంద్రాలు

నగరంలోని అల్లిపురం, పూర్ణా మార్కెట్, అక్కయ్యపాలెం బజారుల్లో ఏళ్ల తరబడి అనేక కుటుంబాలు గాలిపటాలను విక్రయిస్తూనే జీవనం సాగిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఒక్కో గాలిపటం రూ.5 నుంచి రూ.500 మధ్య ధరలో లభ్యమవుతోంది. వీటితో పాటు మాంజాపట్టిన దారం, స్పెడ్ దారాలను విక్రయిస్తున్నారు. ఎక్కువ మంది పతంగులతో పాటు ధారాన్ని కొనుగోలు చేస్తున్నారు.

ఎన్నెన్నో వర్ణాలు

గతంతో పోలిస్తే గాలిపటాల తయారీలో అనేక మార్పులు సంతరించుకున్నాయి. సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త తరహా పతంగులు మార్కెట్‌లో దర్శనమిస్తున్నాయి. రెడీమేడ్‌గా అందరికీ నచ్చేలా పలు డిజైన్లలో గాలిపటాలు అందుబాటులోకి వచ్చాయి. దళసరి ప్లాస్టిక్ కాగితంతో తయారు చేసిన వాటికి ప్రస్తుతం డిమాండ్ ఉంది. నగరంలో విక్రయించే పతంగుల్లో ఎక్కువ భాగం హైదరాబాద్, కోల్‌కతా, ఖరగ్‌పూర్‌ల నుంచి దిగుమతి చేసుకున్నవే ఉంటున్నాయి. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా తయారీ సంస్థలు ఉండటంతో నగర వ్యాపారులు అక్కడి నుంచే ఆర్డర్లపై నగరానికి తెప్పిస్తున్నారు. ఇక ప్లాస్టిక్, పాలిస్టర్, వస్త్రాలతో చేసిన వాటికి గిరాకీ ఎక్కువగా ఉంది. సినీ తారలు, రాజకీయ నాయకులు, కార్టూన్ చిత్రాలతో కూడుకున్న పతంగులు అనేకం నగరంలో దర్శనమిస్తున్నాయి. గతంలో రూ.2కి కూడా గాలిపటం అమ్మేవారు. ఇప్పుడు రూ.5 చెల్లిస్తే తప్ప గాలిపటం దొరకడం లేదు. అతి తక్కువగా రూ.5 నుంచి, గరిష్టంగా రూ.3 వేల ధరలో గాలిపటాలను విక్రయిస్తున్నట్లు అల్లిపురంలోని గాలిపటాల వ్యాపారి బొట్టా భవాని శంకర్ తెలిపారు. గతంలో రూ.5 వేలు ధర పలికే గాలిపటాలను కూడా విక్రయించామన్నారు. అవి ప్రత్యేకంగా తయారు చేయబడి చైనా నుంచి దిగుమతి అయ్యేవని, కేంద్ర ప్రభుత్వం చైనా నుంచి గాలిపటాల దిగుమతులను నిషేధించడంతో అంత ధరలో ఉన్న గాలిపటాల అమ్మకాలు జరగడం లేదన్నారు. గత రెండేళ్లగా కరోనా కారణంగా గాలిపటాల అమ్మకాలు అతి తక్కువగా ఉండేవని, ఈ ఏడాది కరోనా సమస్య లేనందున వ్యాపారం బాగా సాగుతోందని చెప్పారు.

జాగ్రత్తగా ఉండాలి

గ్రామీణ ప్రాంతాల్లో గాలిపటాలు ఎగురవేయడం సులభమే. ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉంటాయి. నగరంలో మాత్రం అంత సులువు కాదు. కాంక్రీట్ జంగిల్‌లా మారిన నగరంలో పతంగులు ఎగురవేసేందుకు స్థలం లేక ఎత్తైన ఇంటి మేడలపైన, గోడలపైన నిల్చొని ఎగుర వేయాల్సి వస్తోంది. ఇక్కడే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. గాలిపటం ఎగురవేసే క్రమంలో గోడల అంచు వరకు వెళ్లకూడదు. రక్షణ గోడలపై పూర్తిగా భారం వేయకుండా చూసుకోవాలి. సాధ్యమైనంత వరకూ సమీపంలో ఉన్న ఏదైనా ఖాళీ ప్రదేశాలకు వెళ్తే మంచిది. విద్యుత్ తీగల్లో గాలి పటాలు ఇరుక్కున్నా చిన్నారులు తీసే ప్రయత్నం చేయరాదు. గాలిపటం తెగితే దాన్ని వెతుక్కుంటూ పరుగు తీయకూడదు.

తహశీల్దార్ కార్యాలయానికి చెదలు

రికార్డులు, ఫర్నీచర్ భద్రతపై సిబ్బంది ఆందోళన

చెదలు పడుతున్న తహశీల్దార్ కార్యాలయం గోడలు

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలోని తహశీల్దార్ కార్యాలయ గోడలకు చెదలు పడుతున్నాయి దాదాపు 40 ఏళ్ల క్రితం నిర్మించిన భవనానికి ఇటీవల రెండు మూడేళ్ల క్రితం లక్షలు వెచ్చించి మరమ్మతులు చేపట్టారు.కార్యాలయానికి రంగులు టైల్స్ వేయించారు. అయితే కార్యాలయ గోడలకు చెదలు పడుతుండడంతో సిబ్బంది సహా మండల వాసులు ఆందోళన చేస్తున్నారు, విలువైన రికార్డులు కార్యాలయంలో ఉండడంతో ఎక్కడ దెబ్బతింటాయోనని అధికారులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా వర్షాకాలంలో కార్యాలయ భవనం లోపల కారిపోతుండడంతో విధుల నిర్వహణకు అధికారులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. అంతేకాక కార్యాలయంలోని రికార్డులకు రక్షణలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెదల నివారణకు చర్యలతోపాటు, మరమ్మతులు చేపట్టాలని కోరుకుంటున్నారు.

ఘనంగా ఆహార గిడ్డంగుల దినోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 'ఆహారాన్ని ఆదా చేయండి - ఆకలితో ఎవరూ బాధ పడకుండా చూడండి' అని గ్రీన్ క్లైమేట్ టీమ్ వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం పిలుపునిచ్చారు. భారత ఆహార గిడ్డంగుల దినోత్సవ వేడుకలను జ్ఞానాపురంలో శనివారం నిర్వహించారు. తొలుత పండ్ల జాతి మొక్కలు నాటారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చట్టం ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఏటా ప్రపంచ వ్యాప్తంగా 2018 లెక్కల ప్రకారం ఆకలి, ఆకలి ఆధారిత జబ్బులతో 90 లక్షల మందికిపైగా మృత్యువాత పడుతున్నారన్నారు. ఈ క్రమంలో ప్రతి మెతుకూ ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రశాంత్ రంజన్ బెహరా, గిరీష్ జక్కా తదితరులు పాల్గొన్నారు.

జలకళ.. వెలవెల..

- బోర్లు వేసినా, బిగించని మోటార్లు
- పత్తా లేని విద్యుత్ సౌకర్యం కల్పన
- కౌగుంట రైతుల ఆందోళన
- స్పందించని అధికారులు
- ప్రకటనకే పరిమితమైన జలసిరి

జలకళ పథకం కింద తవ్విన బోరు పాయింట్ చూపుతున్న రైతులు

ప్రజాశక్తి- రావికమతం : మండలంలో కవగుంట గ్రామంలో వైఎస్ఆర్ జలకళ పథకం వెలవెలబోతోంది. ఈ పథకం ద్వారా రైతులు పొలాల్లో బోరు పాయింట్లు వేసినప్పటికీ, మోటార్లు బిగించిక, విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో నేడవి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. బోర్లు వేసి సంవత్సరం కావస్తున్నా వాటికి మోటార్లు బిగింపుపై ప్రభుత్వం, అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే రైతులకు వ్యవసాయ బోర్లు అవసరమని గుర్తించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ జలకళ పేరుతో నియోజకవర్గాల వారీగా బోర్లును తవ్వించింది.ప్రత్యేకంగా బోరు డ్రిల్లింగ్ వాహనాలను ఆయా గ్రామాలకు పంపించి బోరు పాయింట్లు తీయించినా, తర్వాత పనుల్లో ఇసుమంతైనా పురోగతి లేదని రైతులు వాపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులందరికీ ఉపాధి హామీ పథకం నిధులతో బోర్లను ఉచితంగా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అట్టహాసంగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగానే గ్రామానికి చెందిన రైతులు వీపు అప్పారావు, సమాల వరహాలదొర, కోన అప్పలకొండ, పచ్చికోర లక్ష్మి , వెచ్చం చిననాగరాజులకు చెందిన వ్యవసాయ పొలాలలో బోర్లను ఇటీవల తవ్వించారు. అయితే నేటికి వాటికి విద్యుత్ సదుపాయం, మోటార్ల బిగింపు చేయాల్సి ఉన్నప్పటికీ, ప్రభుత్వపరంగా అటువంటి చర్యలు చేపట్టడంలో జాప్యంపై రైతులు అసహనానికి గురి అవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.

మిరపకు మంచు దెబ్బ

- ముడుచుకుపోతున్న మొక్కలు
- అందని సస్యరక్షణ సూచనలు

సస్యరక్షణ చర్యలు చేపడుతున్న రైతు

ప్రజాశక్తి-పద్మనాభం : ప్రస్తుతం వారం రోజులుగా కురుస్తున్న మంచు కారణంగా మిరప తోటలకు శాపంగా మారిందిని మిరపరైతులు ఆందోళన చెందుచున్నారు. కురిసిన మంచు వల్ల మిరప మొక్కలు ఎదుగుదల లేక, ఆకులు ముడత పడి డీలాగా కనిపిస్తున్నాయని రైతులు అంటున్నారు. మండలంలో ప్రధానంగా రెడ్డిపల్లి, కోరాడ, గెద్దపేట, బి ఆర్ తాళ్లవలస, ఐనాడ, బోత్సపేట, బుడ్డివలస, చిన్నాపురం, అనంతవరం, కోవ్వాడ గంధవరం తదితర గ్రామాల్లో ఎక్కవ శాతం రైతులు మిరపపంటను సాగుచేసి, పచ్చి మిరపకాయలను మార్కెట్లకు తీసుకెళ్లి అమ్ముకుంటారు. ఇదే ఉపాధిగా ఆయా గ్రామాల రైతులు ఈ పంటపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు.

ప్రస్తుతం రెండు అడుగుల ఎత్తు పెరిగిన మిరపపైర్లు మంచు దెబ్బకు ఆకులు ముడత పడి ఎదుగుదల నిలిచి పోయిందని రైతులు వాపోతున్నారు. దీని నివారణకు ఏం చేయాలో పాలుపోని పరిస్థితుల్లో తల్లడిల్లుతున్నారు. మిరపపైర్లు సస్యరక్షణకు సూచనలు చేసేందుకు అటు ఉద్యానవన శాఖాధికారులు గానీ, వ్యవసాయశాఖ అధికారులుగానీ అందుబాటులో లేకపోవడంతో నేరుగా పురుగు మందుల దుకాణాలకు వెళ్లి, అక్కడి వ్యాపారాలు సూచనల మేరకు రసాయన మందులను తెచ్చి పైర్ల సస్యరక్షణకు వాడుతున్నామని అంటు న్నారు ఇదే సమయంలో వ్యాపా రులు నిల్ల వుంచిన పురుగుమందుల డబ్బాలను ముట్టజెపుతూ, కొత్తరకంగా

మంచుకు ముడుచుకుపోయిన మిరప మొక్క

తమను మోసపుచ్చుతున్నారని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు.

పైర్లను కాపాడుకునేందుకు ఏం చేయాలో పాలుపోక తల్లడిల్లుతున్నారు. రైతులకు బాసటగా ఉండేందుకు ప్రస్తుతప్రభుత్వం రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసినా ఆర్భాటమే తప్ప, అక్కడి నుంచి రైతులుకు అవసరమైన సలహాలు, సూచనలు అవసరమైన సమయంలో అందే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా మంచు దెబ్బకు ముడుచుకుపోతున్న మిరపపైర్లకు అవసరమైన సస్యరక్షణ చర్యలకు సూచనలు చేసి పైర్లను రక్షించాలని మిరప రైతులు వేడుకుంటున్నారు.

అసౌకర్యాలతో అవస్థలు!

కనీస సదుపాయాలు లేని భీమిలి పెదబజారు మార్కెట్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక పెద బజారులోని పురాతన మార్కెట్ కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోక కూనరిల్లుతోంది. భీమిలి, ఆనందపురం మండలాలకు చెందిన పలువురు కూరగాయల రైతులు, వ్యాపారులు ఇక్కడి మార్కెట్‌లో కూరగాయలను అమ్ముతుంటారు. ఈ తరహా వ్యాపారులు సుమారు 40 మంది వరకూ ఉంటారు. వీరితోపాటు 25 మంది వరకూ ఎండు, పచ్చి చేపలు అమ్మేవారు, మరో ఇరవై మాంసం దుకాణాలు ఉన్నాయి. ఏళ్ల తరబడి ఆయా వ్యాపారులు కూరగాయలు, చేపలు, మాంసం అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు.

మౌలిక సదుపాయాలు కరువు..

ఇక్కడి మార్కెట్‌లో మౌలిక సదుపాయాలు కరువనే చెప్పాలి. అరకొరగా విద్యుత్ దీపాలు, తాగునీటి సదుపాయం ఉన్నట్లు స్థానిక వ్యాపారులు తెలిపారు. రన్నింగ్ వాటర్ సదుపాయం లేకనే మహిళలకు, పురుషులకు ప్రత్యేకంగా నిర్మించిన మరుగుదొడ్లు అనివార్యంగా నిరుపయోగంగా ఉన్నాయి.

కానరాని శుభ్రత..

మార్కెట్‌లో పరిశుభ్రత లేక పోవడంతో చాలా ఇబ్బందిగా ఉందని చేపలు, కూరగాయలు అమ్మే వ్యాపారులు వాపోయారు. చెత్త, చెదారం, చేపలు, మాంసం వ్యర్థాలు పడేయడంతో దుర్వాసన భరించలేక ఇబ్బంది పడుతున్నట్లు అటు వ్యాపారులు, ఇటు వినియోగ దారులు చెబుతున్నారు.

సమస్యలు పట్టించుకోవడం లేదు..

మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎన్ని దఫాలుగా జివిఎంసి అధికారులకు చెబుతున్నప్పటికీ, ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు.

- ఎల్ అప్పయ్యమ్మ,
కూరగాయల వ్యాపారి

సదుపాయాలు కల్పించాలి

మార్కెట్‌లో పాతికేళ్లుగా కూరగాయల వ్యాపారం చేస్తున్నాను. తాగునీటి సదుపాయం,, మరుగుదొడ్లు పూర్తిస్థాయిలో లేవు. సదుపాయాలు కల్పించాలి

- ఎం.సత్యవతి,
కూరగాయల వ్యాపారి

సమస్యలతో సతమతం

- అరకొరగానే కూరగాయల లభ్యత
- ఇరవై ఏళ్లు దాటినా ఇంకా వీడని బాలారిష్టాలు
- సమస్యలతో కొనుగోలుదారులు, రైతుల అవస్థలు
- ఇదీ మధురవాడ రైతుబజారు దుస్థితి

రైతుబజార్లో నేలపైనే ఆరుబయట కూరగాయల విక్రయం

ప్రజాశక్తి - మధురవాడ : మధురవాడలో రైతుబజారు ఏర్పాటు చేసి రెండు దశాబ్దాలు కావస్తున్నా ఇంకా బాలారిష్టాలు వీడలేదు. నేటికీ పూర్తిస్థాయిలో ఇది వినియోగంలోకి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. నోటీస్‌బోర్డులో కూరగాయల జాబితా చాంతాడంత ఉన్నా, అందులో నాలుగోవంతైనా దొరకని పరిస్థితి. మరోవైపు నేటికీ ఈ రైతుబజారులో సమస్యలు వెంటాడుతున్నా, వాటిని పరిష్కరించడంలో అధికారులు మీనమేషాలు ఎందుకు లెక్కిస్తున్నారో అంతుపట్టడం లేదని స్థానికులు, వినియోగదారులు అంటున్నారు. రైతుబజారులోని 84స్టాళ్లను 105మంది రైతులకు కేటాయించినప్పటికీ, వారికి కనీస సౌకర్యాలు అందుబాటులో లేని పరిస్థితి ఉంది. నగరంలోని అన్ని రైతుబజార్లతోపాటే మధురవాడలోనూ ఒకటి ఏర్పాటు చేసినప్పటికీ, దీన్ని అభివృద్ధి చేయడంలోనూ, నగర వాసుల కూరగాయల అవసరాలకు తగ్గట్టుగా తీర్చిదిద్దడంలో అధికారులు విఫమయ్యారనే చెప్పాలి. ఈ రైతుబజారుకు ఆనందపురం, పద్మనాభం, అరకు తదితర ప్రాంతాల నుంచి రైతులు తాము పండించిన కూరగాయలను విక్రయానికి తెస్తారు. ఈ ప్రాంతంలో ఉన్న దాదాపు మూడు లక్షలమంది జనాభాకు తగ్గట్టుగానే రైతు బజారులోని నోటీస్ బోర్డులో కూరగాయల లిస్ట్ పెద్దదే ఉంటుంది. అయితేబోర్డులో పేర్కొన్న కూరగాయలేవీ దుకాణాల్లో మచ్చుకైనా కానరావు.

ఇవీ సమస్యలు..

మరోవైపు ఈ రైతుబజారులో అనేక సమస్యలు తిష్టవేసి ఉన్నాయి. చినుకు పడితే బజారంతా బురదమయమే. గోతులు కూడా పడి వినియోగదా రులు అవస్థలు పడుతున్నారు. బజారు వచ్చే ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాలతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతుబజారులో ఉన్న సిసి కెమెరాలు పనిచేయకపోవడంతో వినియెగదారులతో పాటు సిబ్బంది కూడా ఇబ్బంది పడుతున్నారు. రైతుబజారులో ఉల్లి, టమోటా, బంగాళాదుంపలకు ఒకే కౌంటర్ ఉంది. వీటికి అదనపు కౌంటరు ఏర్పాటు చేస్తే వినియోగదారులకు సౌలభ్యంగా ఉంటుంది. పేరుకే 84స్టాళ్లు ఉన్నప్పటికీ, ఈ ప్రాంతవాసులకు పూర్తిస్థాయి కూరగాయలు అందని పరిస్థితి ఉంది. అదీ ఒక్క పూటకే పరిమితం కావడం వల్ల ప్రయోజనం లేకుండా పోతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి, రైతుబజారులోని సమస్యలను పరిష్కరించి, ఆధునికీకరించడం ద్వారా మెరుగైన సేవలను వినియోగదారులకు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలు

రైతుబజార్లోని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. మరుగుదొడ్లు, అదనపు స్టాల్స్ కోసం ప్రతిపాదనలు పంపాం. స్టాల్స్ కొరత కారణంగా లాటరీ ప్రకారమే దుకాణాలు కేటాయిస్తున్నాం.

పి.జగదీష్, రైతుబజారు ఎస్టేట్ అధికారి

పండగ వేళ.. ఉక్కు నినాదం

భోగి మంటల వద్ద 'సేవ్ వైజాగ్ స్టీల్' కార్యక్రమాలు
స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటానికి విశాఖ వాసుల విశాల మద్దతు

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

భోగి పండగ వేళ ఉమ్మడి విశాఖ జిల్లాలో 'ఉక్కు' నినాదం మార్మోగింది. సంక్రాంతి వేడుకల్లో 'సేవ్ వైజాగ్ స్టీల్' పేరిట విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, సిఐటియు ఇచ్చిన పిలుపును విశాఖ వాసులు అందిపుచ్చుకున్నారు. పౌర, ప్రజా, కాలనీ సంఘాలతో పాటు సిపిఎం, సిఐటియు ఆధ్వర్యాన వాడవాడలా శనివారం భోగి మంటల వద్ద కార్యక్రమాలు నిర్వహించారు. ఒక్కో కట్టెనూ భోగి మంటలో వేస్తూ 'సేవ్ వైజాగ్ స్టీల్, విశాఖ ఉక్కును కాపాడుకుంటాం, విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' అంటూ నినదించారు. కొన్నిచోట్ల ప్లకార్డులు ప్రదర్శించారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినదించారు.

కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను మోడీ ప్రభుత్వం అమ్మడాన్ని నిరసిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్దనున్న విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల దీక్షా శిబిరం ఆవరణలో సిఐటియు ఆధ్వర్యంలో భోగి మంట వేశారు. ప్రజలు ఒక్కో కట్టెనూ మంటలో వేసి 'సేవ్ స్టీల్‌ప్లాంట్, స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుందాం, ప్లాంట్ అమ్మకం ఆపాలి, అమ్మేదెవడురా.. కొనేదెవడురా' అంటూ పెద్ద పెట్టున నినదించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తామని మోడీ ప్రభుత్వం ప్రకటించి రెండేళ్లు అవుతోందన్నారు. నాటి నుంచి నేటి వరకూ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు ఐక్యంగా ప్రజలను, కార్మికులను కదిలించి ఉద్యమిస్తున్నాయని గుర్తుచేశారు. బిజెపి అధికారంలోకి వచ్చాక ఒక్క ప్రభుత్వ రంగ పరిశ్రమను నెలకొల్పకపోగా ఉన్న వాటిని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడం దుర్మార్గమన్నారు. స్టీల్‌ప్లాంట్ తెలుగు ప్రజలు ఐక్యంగా పోరాడి సాధించుకున్న ప్రభుత్వరంగ సంస్థని, దీనిని అమ్మే హక్కు ఎవడికీ లేదని హెచ్చరించారు. మోడీ ప్రభుత్వం వెనక్కుతగ్గే వరకూ ఈ ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలిచేందుకు కార్మికవర్గం కంకణం కట్టుకుందన్నారు. బిజెపి ఎంపీ జివిఎల్.నరసింహారావును, స్థానిక ఎమ్మెల్సీ మాధవ్‌ను ప్లాంట్‌ను అమ్మడానికి, ప్రభుత్వ రంగాన్ని నాశనం చేయడానికి ప్రజలు ఎన్నుకోలేదని గుర్తుచేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కెఎం.కుమార్ మంగళం, నాయకులు ఎం.సుబ్బారావు, వై.రాజు, కెవిపి.చంద్రమౌళి, కె.చంద్రశేఖర్, కె.కుమారి, కె.నర్సింగరావు తదతరులు పాల్గొన్నారు.

గాజువాకలో భోగి మంట వద్ద ఉక్కు నినాదాలు చేస్తున్న రాంబాబు తదితరులు

మరోవైపు అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శనివారానికి 653వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ నాయకులు కూర్చున్నారు.

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద భోగి మంట వేసి 'సేవ్ వైజాగ్ స్టీల్' ప్లకార్డులను ప్రదర్శిస్తున్న నాయకులు

జోన్ ప్రధాన కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి మాట్లాడారు.

డివైఎఫ్ఐ ఆధ్వర్యాన

కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ డాబాగార్డెన్స్‌లోని కృష్ణా గార్డెన్స్‌లో శనివారం డివైఎఫ్ఐ నేత కె.గణేష్ కుమార్ ఆధ్వర్యాన భోగిమంట వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి మాట్లాడారు. ఎం.సుబ్బారావు, రామారావు, వై.రాజు పాల్గొన్నారు.

గాజువాక : స్వతంత్ర నగర్, దుర్గానగర్, దశమకొండ, రామచంద్ర నగర్, అక్కిరెడ్డిపాలెం, అప్పన్న కాలనీ, భానోజీ తోట ఏరియాల్లో ఉక్కు నినాదం మార్మోగింది. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాల్లో సిపిఎం జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, సిఐటియు కార్యదర్శి ఎ.లోకేష్, అధ్యక్షులు డి.రమణ, నాయకులు పి.నర్సింగరావు, కటారి నాగేశ్వరరావు, కటారి అప్పారావు, డి.అప్పారావు మహిళా సంఘం నాయకులు జి.లక్ష్మి, డి.రమణమ్మ, వై.అరుణ, వై.రమేష్, వై.వెంకటలక్ష్మి, పి.జ్యోతి, సత్తిబాబు పాల్గొన్నారు.

తోకాడ సమైక్య అపార్టుమెంట్ వద్ద..

తోకాడలోని సమైక్య అపార్టుమెంట్ వద్ద భోగి మంట వేసి 'సేవ్ వైజాగ్ స్టీల్' పేరిట కార్యక్రమం నిర్వహించారు. ప్రైవేటీకరణ భూతం దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. జిఒ నెంబర్ 1 కాపీలను భోగి మంటలో దహనం చేశారు. కార్యక్రమంలో సమైక్య అపార్టుమెంట్స్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు, సెక్రటరీ తవిటయ్య, వైస్ ప్రెసిడెంట్ తౌడన్న, కమిటీ సభ్యులు చిన్నంనాయుడు, శ్రీనివాస్ చౌదరి, సన్యాసయ్య, శంకరరావు, మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.